

# మినీకథావీధి

## ఆ ఎర్రటి కళ్ళు

అద్దేపల్లి సుచిత్రాదేవి

"ఏయ్ రిక్షా, రిక్షా" నేను పిలుస్తూనే వున్నాను. అది కాస్తా, స్పీడ్‌గా వెళ్ళిపోయింది.

"ప్చ్. వినిపించుకుని చావరు. అయినా ఖాళీగావున్నప్పుడు, అటూ, యిటూ చూసుకుంటూ కాస్త నిదానంగా వెళ్ళకూడదూ" నాలో నేనే విసుక్కున్నాను.

రెండు చేతుల్లోనూ రెండు ప్లాస్టిక్ బుట్టలు. ఒక దాంట్లో కూరలు. మరో దాంట్లో పొటాలు పైగా భుజంనుంచి వేలాడుతున్న హేండ్‌బేగ్. నాకు చేతులు లాగుతున్నాయి. పైగా తలనొప్పి. చిరాగ్గా వుంది. రిక్షాలెక్కడా కనుచూపు మేరలో కనిపించలేదు. అవసరమున్నప్పుడు యింతే, ఒక్కటీ కనిపించదు. లేకపోతే రోడ్డునిండా అవే అడ్డొస్తాయి. కొద్ది దూరం అలాగే నడిచాను కళ్ళుమాత్రం రిక్షా కోసం వెదుకుతూనే వున్నాయి.

"ఆ, అదిగో. ఆ వీధిచివర నుంచి రిక్షా, ఖాళీగానే వున్నట్టుంది" వడివడిగా అటు అడుగులు వేశాను.

దగ్గరకు వెళ్ళి "రిక్షా వస్తుందా" గట్టిగా అడిగాను. సీటుపై కూచుని కునికిపాట్లు పడుతున్నఅతను పులిక్కిపడి రిక్షాదిగాడు.

"ఏడికెళ్ళాలమ్మా?" అడిగాడు సీటును దులుపుతూ. నేనుఅడ్రసు చెబుతూ "ఎంతిమ్మంటావ్" అన్నాను.

"మీరే చెప్పండమ్మా. మీ యిష్టం" నా వంక ఆశగా చూస్తూ అన్నాడు. అప్పుడు చూశాను అతన్ని పరిశీలనగా. కళ్ళు ఎఱ్ఱగా నిప్పుల్లావున్నాయి. మనిషికొంచెం తూలుతున్నట్టే అనుమానం. మాటకూడా మత్తుగా వస్తూంది.

"బాగా తాగేసినట్లున్నాడువెధవ. యిప్పుడెలా?" అనుకున్నాను. నాకు తాగుబోతులంటే చెప్పలేని అసహ్యం, కోపం.

"ఈ రిక్షాలో ఎక్కితే యిల్లు చేరేది నిజమేనా?" కాని చేతులు బరువుకి మొరాయిస్తున్నాయి. ఆ కొసనుంచి, యీ కొసకి పరికించే చూశాను ఎక్కడా మరో ఖాళీ రిక్షా కనిపించలేదు.

మళ్ళీ రిక్షావాడి వంక చూసాను. వాడలాగే నా వంక ఆశగా, ఆకలిగా చూస్తున్నాడు.

"ముప్పావలా యిస్తాను" అన్నాను. వాడెలాగూ రాడని తెలుసు. మామూలుగా యిక్కడనుంచి యింటికి రూపాయి పావలాకి తక్కువెవరూ రారు.

అంతే, "ఎక్కండమ్మా" అన్నాడు వాడు బయలుదేరడానికి సిద్ధపడుతూ.

"తాగుబోతువెదవ, ఎంత తీసుకోవాలో కూడా మర్చిపోయినట్లున్నాడు. యీ నిషాలో తీసుకెళ్ళి ఏ లారీకో, బస్సుకో గుద్దెయ్యడు కదా లేకపోతే కావాలని అటెటన్నా తీసుకెళ్ళి ఏమన్నా అఘాయిత్యం చెయ్యాలనుకుంటున్నాడేమో. అసలా ప్లానులోనే యింత తక్కువకి తీసుకెళతానంటున్నాడేమో" అనుమానంగా వాడి వంక చూశాను.

"ఏమిటాలస్యం?" అన్నట్లు చూస్తున్నాడు వాడు.

ఆ ఎర్రటి కళ్ళు, ఒళ్ళు తూలడం చూస్తుంటే ఆ రిక్షాలో ఎక్కడం పిచ్చితనం అనిపిస్తున్నా సహజంగా కొంచెం సాహసాలపై కుతూహలం గల నేను సరే ఏమవుతుందో చూద్దాం అని కావాలనే ఎక్కి కూచున్నాను. చేతులకి బుట్టల భారం తగ్గాక రిలీఫ్‌గా అనిపించింది. రిక్షావాడు నెమ్మదిగా లాగుతున్నాడు బండిని.

వీడేమన్నా తాగుడుమైకంలో పిచ్చివేషాలెయ్యబోతాడేమో- బాగా బుద్ధి చెప్పాలి. ఆడపిల్లకదా ఏంచేస్తుందిలే అనుకుంటున్నాడేమో—నాకు కరాటే వచ్చిన సంగతి వీడికేం తెలుసు. ఫట్ ఫట్ మని రెండిసేసరి— యిక మళ్ళీ జన్మలో తాగకుండా బుద్ధి వస్తుంది వెధవకి.

అసలెందుకు తాగుతారీ మనుషులు? డబ్బునష్టం, పరువునష్టం, ముఖ్యంగా ఆరోగ్యం నష్టం. ఇప్పుడీ రిక్షావాడి సంగతే తీసుకుందాం. ఇతగాడి సంపాదనలో భార్యా పిల్లలకి సక్రమంగా తిండి పెట్టడమే కష్టం. అలాంటిది వీడిలా తాగి తందనాలాడుతూ ఆ కొద్ది సంపాదన కాస్తా యిలా తగలేసుంటే— ప్చ్ యిక వాళ్ళకేం అన్నం పెడతాడు?



అసలు ఈ తాగుబోతు వాళ్ళందర్నీ వరుసగా నిలబెట్టి నిర్దాక్షిణ్యంగా కాల్చి పారెయ్యాలి అప్పటికిగ్గానీ దేశం బాగుపడదు. ప్రపంచంలోవున్న మత్తుపానీయాలన్నింటిని సముద్రంలో పారబోయించి యిక మళ్ళీ కొత్తగా తయారుచెయ్యనీ కూడదు. అలా చేస్తేకాని తాగుబోతులకి బుద్ధిరాదు.

నా వూహలకి నేనే నవ్వుకున్నాను. ఇప్పుడీమాటలేకనుక పైకి పెద్దగా అన్నానంటే టీ. హెచ్. బి. (తాగుబోతులకి నేను పెట్టిన నిక్ నేమ్ అది) అంతాకలిపి నన్ను హత్య చేసేందుకు వస్తారేమో.

ఇలా తాగుబోతు రిక్షాలో కూచుని చాలా తీవ్రంగా తాగుడు గురించి ఆలోచిస్తున్న నేను రిక్షా మలుపు తిరగబోతూ హఠాత్తుగా ఎదురుగా పెద్దలారీ రావటంతో రిక్షాఅతను వేసిన సడన్ బ్రేక్‌కి ముందుకు పడబోయి వులిక్కిపడి ఈ లోకంలోకి వచ్చి సర్దుకు కూర్చున్నాను.

లారీ పెద్ద శబ్దం చేసుకుంటూ వెళ్ళిపోయింది. ఇంకొంచెంవుంటే ఆ లారీ కిందపడి రిక్షా పచ్చడయి వుండేది. మైగాడ్! ఎంత ప్రమాదం తప్పింది? అప్రయత్నంగా గుండెలపై చెయి వేసుకున్నాను. ముందుకు చూశాను. అప్పుడే తల తిప్పి, ఆ ఎర్రటి కళ్ళతో నా వంకోసారి చూసి చిన్నగా నవ్వాడు రిక్షావాడు— "భయపడ్డారా అమ్మా" అడిగాడు.

నాకు చిరాకువేసింది. అతను మామూలుగా వుండివుంటే అలా ఏక్సిడెంట్ తప్పించినందుకు నిజంగా నేనూ సంతోషంగా ఒక మాట అని వుండేదాన్నేమో. కానీ అతను తాగి వున్నాడు. అసలందుకే ఏక్సిడెంట్ జరగబోయివుంటుంది. ఆ వూహ వచ్చి కోపంగా, సీరియస్‌గా చూశాను. అతనేమనుకున్నాడో మళ్ళీ రోడ్డువైపు తల తిప్పి నిదానంగా బండిని లాగసాగాడు.

'వెధవ రిక్షా, నత్త అన్నా కాస్త వేగంగా వెళుతుందేమో, పెళ్ళి వూరేగింపులాగా యీ వెళ్ళడమేమిటి? కొంచెం స్పీడ్‌గా లాగకూడదూ, అయినా ఆ వున్న శక్తి అంతా యీ తాగుడుకే ఆవిరై పోయి వుంటుంది. ఇంక బలంగా రిక్షా ఏం లాగగలడు?'

నేనింకా యిలా ఆలోచిస్తూనే వున్నాను. యిల్లు దగ్గర కొచ్చేసింది. యింకో రెండు వీధులు తిరగాలి, అంతే. కానీ యింతలో హఠాత్తుగా రిక్షా అతను రిక్షా తొక్కటం ఆపేసి ముందుకు సోలిపోసాగాడు. నేను కంగారుగా, ఏం చెయ్యాలో తోచనట్లు అతని వంకే చూస్తున్నాను. అతనే ఎలాగో తమాయించుకొని నిలదొక్కుకున్నాడు.

"ఏమయింది?" నేను రిక్షా దిగేసి అడిగాను.

నా వైపోసారి చూసి చిన్నగా నవ్వాడు. ఆ నవ్వెంతో నీరసంగా వుంది.

"ఒళ్ళు బాగాలేదమ్మా. జొరం మండిపోతూంది. అన్నం తిని రెండురోజులైంది కొద్దిగా నీరసంగా వుండి ఒళ్ళు తూలింది. అంతే. మీరు ఎక్కండమ్మా తీసుకెళ్ళిపోతాను." లేని వుత్సాహం తెచ్చుకుంటూ అన్నాడు.

"మరి రిక్షా ఎందుకు లాగుతున్నావ్. యింట్లో వుండక" అడగలేక అడిగాను.

మళ్ళీ అతను అలాగే నవ్వాడు. "జొరమని పడుకుంటే డబ్బులెట్టావస్తాయమ్మా? రెక్కాడితేగానీ- డొక్కాడని బతుకులు. యిల్లు గడవాలికదా" మాటలు ఆయాసంగా వస్తున్నాయి.

చెళ్ళున మొహం మీద కొట్టినట్లు వుంది నాకు.

ఇతన్నా తను తాగుబోతు అనుకుంది?

పాపం యింత అనారోగ్యంలో కూడా తన యింటికోసం శ్రమపడుతున్నాడు. జ్వరం వలన ఎర్రబడిన కళ్ళు చూసి తాగటంవల్ల అనుకున్నాను. నీరసానికి ఒళ్లు తూలుతుంటే నిషా వలన అనుకున్నాను.

ఛ. ఛ. ఎంత అపార్థం చేసుకున్నాను! ఒక్కోసారి మనకళ్ళే మనల్ని మోసగిస్తాయంటారు. ఎంత నిజం! లేకపోతే నాకు పెద్ద ఫేస్‌రీడింగ్ తెలుసని మురిసిపోతుంటాను. అసలు నాకేం తెలుసని?

ఇతనో తాగుబోతు అనుకుని యిందాకటి నుంచి నిర్దాక్షిణ్యంగా యితన్ని తిడుతూ వచ్చాను.

అంతకన్నా దారుణం ఉంటుందా! యింతగా ఒళ్లుబాగులేని యితను రిక్షాలాగుతుంటే నేను దర్జాగా కూర్చునివచ్చాను.

పైగా వేగంగా వెళ్ళటం లేదని విసుక్కున్నాను. మామూలుకన్నా అతి తక్కువకి మాట్లాడాను.

ఛ, నా ప్రవర్తన నాకే సిగ్గువేసింది. ఇంకేం ఆలోచించలేకపోయాను. గబుక్కున బేగ్ తెరిచి ఓ రెండు రూపాయల కాగితంతీసి అతని చేతిలో పెట్టాను.

అంతకన్నా ఏం చెయ్యగలను? మధ్య తరగతి యింటి ఆడపిల్లను. ఆశయాలూ, ఆదర్శాలూ ఆలోచనల్లోనేకాని ఆచరణలో కొచ్చేసరికి పరిస్థితులూ, వాస్తవాలూ అడ్డొచ్చే సామాన్యురాలిని.

రిక్షాలో వున్న బుట్టలు తీసుకుని "యిల్లు వచ్చేసిందిలే. నేను వెళతాను. నువ్వెళ్ళు" అని చెప్పేసి. నావంక తెలబోయిచూస్తున్న అతని ముందు యింకా నిలబడలేక వడివడిగా ముందుకు అడుగులు వేశాను. ❁


శ్రీటెక్స్
ఫ్యాబ్రిక్స్
ఇంటింటి
అవసరాలకు...
ఇంటిల్లిపాది
ఆనందానికి...
శ్రీటెక్స్
దుప్పట్లు
శ్రీటెక్స్
తువ్వాళ్ళు
శ్రీటెక్స్
ఫర్నిషింగ్స్
అందానికి..
ఆకర్షణకి..
మన్నికకు...నమ్మికకు
మేలైన రంగులకు
వాడండి!
SreeTex
ఉత్పత్తిదారులు:
ఓ.జి. టెక్స్‌టైల్స్
(ప్రై) లిమిటెడ్.
సేలం-636006